

నృసింహునికి పూజలు

ధర్మపురి: ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి బుధవారం శ్రీలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో పూజలు చేశారు.



పాఠశాలల సందర్శన

ధర్మపురి: పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌తోపాటు దోనూర్ పీఎస్‌ను అదనపు కలెక్టర్ మకరంద్ సందర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.0/18.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మల్యాల(చొప్పదండి): తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగడీబజార్ నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసీడీఎస్ కార్యాలయంలో సమర్పించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రజిత మాట్లాడుతూ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు అనేక సమస్యలతో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఐసీడీఎస్‌కు నష్టం కలిగించే నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని, పెంచిన వేతనాలు, బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభ, రమ, హరిప్రియ, జయప్రద, మణెమ్మ, సంధ్య, సురేఖ, పుష్ప, సుజాత పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్



మెట్‌పల్లి(కోరుట్ల): మున్సిపల్ కమిషనర్‌గా జగదీశ్వర్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన సమ్మయ్యను రెండు నెలల క్రితం హుజూరాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇప్పటిదాకా ఎవరినీ నియమించలేదు. డీఈ రాజ్‌కుమార్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తూ వస్తున్నారు. అయితే, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌ను రెండ్రోజుల క్రితం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. జగదీశ్వర్‌గౌడ్ గతంలో ఇక్కడ కొంతకాలం పనిచేశారు. కాగా, ఆయనను వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావుతోపాటు సిబ్బంది తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

సహకార సంఘాలను బలోపేతం చేస్తాం



శంకుస్థాపన చేస్తున్న రవీందర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): సహకార పరపతి సంఘాలను మరింత లోపేతం చేస్తామని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు స్పష్టంచేశారు. పట్టణంలో రూ.70 లక్షల వ్యయంతో చేపట్టిన విశాల సహకార పరపతి సంఘ భవనం, గోదాము నిర్మాణాలకు ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. సహకార సంఘాలు రైతులకు అనేక రకాల సేవలు అందిస్తున్నాయని తెలిపారు. రైతులు తమవంతుగా వాటి అభ్యున్నతికి సహకారం అందించాలని సూచించారు. రైతుల డిపాజిట్లపై వడ్డీరెట్ల పెంపు, రుణాలపై వడ్డీరెట్ల తగ్గింపు ఆలోచన చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తీగల లింగారెడ్డి, ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు సురకంటి సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

3న నిరసన ప్రదర్శనలు



విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): వంటగ్యాస్‌పై రూ.55 పెంచిన కేంద్రప్రభుత్వం.. మహిళా దినోత్సవానికి ముందు మహిళలకు కానుక ఇచ్చిందని, దీనిని నిరసిస్తూ ఈ నెల 3న జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో రూ.400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధర.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1200కు చేరిందని విమర్శించారు. ధరలను అడ్డగోలుగా పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజలను మోదీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ ప్రభుత్వాన్ని కేసీఆర్ ఆధ్వర్యంలో గద్దె దించుతామని ఆయన హెచ్చరించారు. వయసుతో సంబంధం లేకుండా యువకులు గుండెపోటుకు గురికావడం ఆందోళన కలిగిస్తోందని, సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని తెలిపారు. త్వరలోనే దీనిపై పలు శాఖల అధికారులతో అవగాహన కల్పిస్తామని ఆయన చెప్పారు. నాయకులు పాల్గొన్నారు.

బీదర్ దొంగల పనే..



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్, పోలీసు అధికారులు

- మోటార్ సైకిళ్లపై వచ్చి చోరీ
- భక్తుల వేషధారణలో లోనికి
- అంజన్న దర్శనం.. ఆ తర్వాత రెక్కీ
- మొత్తం దొంగలు ఏడుగురు
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- 5 కిలోల వెండి ఆభరణాలు స్వాధీనం
- ఎస్పీ భాస్కర్ వెల్లడి



స్వాధీనం చేసుకున్న వెండి అభరణాలు

జగిత్యాలజోన్: కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో చోరీచేసింది కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లాకు చెందిన దొంగలని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం ఏడుగురు పాల్గొన్నారని గుర్తించారు. అందులో ముగ్గురిని అరెస్ట్ చేసి, వారినుంచి 5 కేజీల వెండి అభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మిగతావారి కోసం మూడు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. జిల్లా పోలీస్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో మంగళవారం ఎస్పీ భాస్కర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొండగట్టు చోరీ, నిందితుల అరెస్ట్ వివరాలు వెల్లడించారు.

మోటార్ సైకిళ్లపై కొండగట్టుకు..

దొంగల ముఠా కర్ణాటక నుంచి కొండగట్టుకు మోటార్ సైకిళ్లపై ఫిబ్రవరి 22న రాత్రి చేరుకుంది. భక్తుల మాదిరిగా తెలుపు, కాషాయ వస్త్రాలు ధరించి అదేరోజు రాత్రి అంజన్నను దర్శించుకుంది. మరుసటిరోజు(ఫిబ్రవరి 23)న మరోసారి స్వామివారిని దర్శించుకుంది. ఈ సమయంలోనే పరిసరాలపై రెక్కీ నిర్వహించింది. అదేరోజు అర్ధరాత్రి(శుక్రవారం వేకువజామున) దాటాక ఆలయం వెనకాల అటవీ ప్రాంతం నుంచి ఆలయంలోకి ప్రవేశించింది. స్వామివారిపై ఉన్న మకర తోరణం, కిరీటం, ఆలయంలోని రెండు శఠగోపాలు, ఒకవెండి గొడుగు, పెద్ద రామరక్ష, ద్వారాలకు ఉన్న కవచ ముఖాలు దొంగిలించింది. ఆ తర్వాత మళ్లీ మోటార్ సైకిళ్లపైనే కర్ణాటకు బయలుదేరి వెళ్లింది. దాదాపు రూ.9 లక్షల విలువైన 15 కేజీల వెండి అభరణాలు చోరీకి గురైనట్లు పూజారులు మల్యాల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

27 మంది పోలీసులకు రివార్డులు..

కొండగట్టు చోరీ కేసును చాలెంజ్‌గా తీసుకుని, 24 గంటల్లోనే దొంగలను గుర్తించి, నాలుగైదు రోజుల్లోనే ముగ్గురు నిందితులను పట్టుకున్న పోలీసులను ఎస్పీ భాస్కర్ అభినందించారు. వారికి ప్రభుత్వం తరఫున రివార్డులు అందించనున్నట్లు చెప్పారు. డీఎస్పీ ప్రకాశ్, మల్యాల సీఐ రమణమూర్తి, కోరుట్ల సీఐ పవన్‌కుమార్, సీసీఎస్ సీఐ నాగేశ్వర్‌రావు, ఎఫ్‌పీయూ సీఐ రాజు, ఐటీ కోర్ సీఐ సరిలాల్, మల్యాల ఎస్‌ఐ చిరంజీవి, సీసీఎస్ ఎస్‌ఐ సుధాకర్, ఆర్‌ఎస్‌ఐలు సుమన్, మల్లేశ్, హెడ్‌కానిస్టేబుల్ నస్సర్, సీడీఆర్ పీసీ రాజశేఖర్, కానిస్టేబుళ్లు తిరుపతి, నాంపల్లి, మల్లేశ్, రాజేందర్, సుమన్, రఘు, హరి, వేణు, మహేశ్, తిరుపతి, కిరణ్, సంతోష్, రమేశ్, సురేశ్, మహేశ్, సంతోశ్‌ను ఎస్పీ భాస్కర్ అభినందించారు.

అందరూ రక్త సంబంధీకులే..

- కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా ఔరద్ తాలుకా హులియద్ తండాకు చెందిన బాలాజీ కేశవ రాథోడ్, రామరావు జాదవ్, రాంశెట్టి జాదవ్, విక్రమ్ జాదవ్, నర్సింగ్ జాదవ్, దేవిదాస్ జాదవ్, విజయ్ కుమార్ రాథోడ్ ఒకే ప్రాంతానికి చెందిన రక్తసంబంధీకులు.
- వీరు ముఠాగా ఏర్పడి ఆలయాల్లో దొంగతనాలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.
- ఇప్పటికే మహారాష్ట్రలోని పండరీపురం, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని చాముండేశ్వరి తదితర ఆలయాల్లో చోరీచేశారు.
- కొండగట్టు ఆలయంలో జరిగిన చోరీలోనూ వీరు పాల్గొన్నారు. ఇందులో తండ్రీకొడుకులు ఉండటం గమనార్హం.

10 బృందాలతో గాలింపు..

- అప్రమత్తమైన ఎస్పీ భాస్కర్.. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 10 పోలీసు బృందాలను నియమించారు.
- దొంగలను పట్టుకునేందుకు గాలింపులు తీవ్రతరం చేశారు.
- అంతకుముందే ఫింగర్ ప్రింట్, డాగ్ స్క్వాడ్స్‌తో ఆధునిక శాస్త్ర, సాంకేతిక సమాచారం సాయంతో 24 గంటల్లోనే దొంగల గుర్తింపుపైనా అవగాహనకు వచ్చారు.
- కర్ణాటకకు చెందిన దొంగల ముఠా పనేనంటూ, వారిని పట్టుకునేందుకు ఆ రాష్ట్రంలో గాలింపు చేపట్టారు.
- ఈ నేపథ్యంలో ఏడుగురు నిందితుల్లో ఎ-1 బాలాజీ కేశవ రాథోడ్, ఎ-5 నర్సింగ్ జాదవ్, ఎ-7 విజయ్ కుమార్ రాథోడ్‌ను అదుపులోకి తీసుకున్నారు.
- వారినుంచి రూ 3.50 లక్షల విలువైన 5 కిలోల వెండి ఆభరణాలు(వెండి శఠగోపం, ఒకవెండి గొడుగు, ఒకవెండి పెద్ద రామరక్ష, రెండు ద్వారాలకు గల కవచం ముఖాలు, మోటార్ సైకిల్, రెండు సెల్ ఫోన్ల)ను స్వాధీనం చేసుకున్నారు.
- ఎ-2 రామరావు జాదవ్, ఎ-3 రాంశెట్టి జాదవ్, ఎ-4 విక్రమ్ జాదవ్, ఎ-6 దేవిదాస్ జాదవ్ ఆచూకీ కోసం మూడు పోలీసు బృందాలు కర్ణాటక రాష్ట్రంలో గాలింపు చేస్తున్నాయి.

ల్యాండ్, సాండ్.. వైన్స్, మైన్స్‌లే..

బీఆర్‌ఎస్‌కు ఆదాయ మార్గాలు



హాథ్ సే హాథ్ జోడోయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్న రేవంత్‌రెడ్డి

- నిబంధనలకు విరుద్ధంగా ఇసుకక్వారీలు
- బినామీ పేర్లతో వందల కోట్ల వ్యాపారం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



బిజిగిరిషరీఫ్ దర్గాలో పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

ఇల్లందకుంట: బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులైన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాఫియాలా ఏర్పడి స్యాండ్, ల్యాండ్, మైన్స్, వైన్స్‌లను ఆదాయ వనరులుగా మార్చుకొని వందల కోట్లు కొల్లగొడుతున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల మానేరు ఇసుక క్వారీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మానేరు వాగు ఇసుక దందాను పరిశీలించడానికి మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, నాయకులు కవ్వంపల్లి సత్యనారాయణ, విజయరమణారావు, బల్మూరి వెంకట్‌లతో కలిసి వచ్చారు. ఇసుక దోపిడీని బాహ్య ప్రపంచానికి తెలియపర్చడానికి నిజనిర్ధారణ కమిటీ ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇసుక మాఫియాతో కేసీఆర్ కుటుంబానికి భాగస్వామ్యం ఉంది కాబట్టే.. యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శించారు. ఈ మాఫియాకు కేసీఆర్ కుటుంబానికి చెందిన జోగినపల్లి సంతోష్, తన తండ్రి రవీందర్‌రావుకు భాగస్వామ్యం ఉందన్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ నిబంధనలకు విరుద్ధంగా.. పర్యావరణానికి హాని కలిగించేలా.. భవిష్యత్ తరాలకు ఇసుక కనుమరుగయ్యేలా తోడేళ్లలా తోడేస్తున్నారన్నారు. ఈ మాఫీయాను అడ్డుకునేవారు లేకపోవడంతో వీరి వ్యాపారం మూడుపువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతోందని అన్నారు. బినామీ పేర్లతో వందల కోట్ల వ్యాపారం చేస్తూ వేల కోట్ల రూపాయలు, ఆస్తులు పెంచుకుంటుంటే ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని చెప్పడం రామారావుకే చెల్లిందన్నారు.

ఇసుక మాఫియాను అడ్డుకుంటే కేసులా..?

ఇసుక మాఫియాను అడ్డుకుంటే సిరిసిల్లలో పట్టిన గతే పడుతుందని రైతులు, యువకులను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, గతంలో తనుగులకు చెందిన ఒకరిద్దరు రైతులపై పోలీసులు చిత్రహింసలకు పాల్పడి థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. మాఫియాకు పోలీసులు ప్రైవేట్ సైన్యంగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఇసుక మాఫియా వల్లనే కాళేశ్వరం కొట్టుకుపోయిందన్నారు. పర్మిషన్ పేరిట ఒకే నంబర్‌తో పలు వాహనాల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని అన్నారు.

సంజయ్, ఈటల ఎటు పోయారు..

ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సొంత ఇలాకాలో ఇసుక దోపిడీ జరుగుతుంటే ఎక్కడికి పోయాడని రేవంత్ ప్రశ్నించారు. ఇక్కడకు రాకముందు ఈటలపై ఎంతో గౌరవం ఉండేదని.. పరిస్థితి చూశాక ఉన్న గౌరవం పోయిందన్నారు. మానేరువాగు నుంచి రాత్రి, పగలు పర్మిషన్ ఉన్నదానికంటే ఎక్కువగా వందల లారీలను వరంగల్, హన్మకొండ, హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తుంటే ఎంపి సంజయ్, ఈటల మౌనంగా ఉండడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. వాహనాల ఓవర్‌లోడ్‌తో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అవుతుంటే ఎందుకు ఫిర్యాదు చేయడంలేదని మండిపడ్డారు. తనుగుల నుంచి 10 కి.మీ. దూరంలో ఉన్న జమ్మికుంటకు ప్రయాణం చేయాలంటే రెండు గంటల సమయం పడుతోందన్నారు. అధికారుల పర్యవేక్షణలో ఇసుకను తీయాలని.. యంత్రాలతో కాకుండా కూలీలతో తీయాలని.. కానీ అలా జరగడం లేదన్నారు. అధికారులను అడుగుదామంటే ఒక్కరూ అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంపీగా, పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న తనకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు ఎక్కడని ప్రశ్నించారు.

కేసీఆర్ కుర్చీ కదులుతుందనే దాడులు..

కాంగ్రెస్ పార్టీకి పాదయాత్ర కొత్త కాదని.. పాదయాత్ర వల్ల కేసీఆర్ కుర్చీ కదులుతుందనే కాంగ్రెస్ పార్టీపై బీఆర్‌ఎస్ పార్టీ దాడులు చేస్తోందని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఎలాంటి దాడులకు తాము భయపడేదిలేదని, భవిష్యత్‌లో కూడా పాదయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు. అక్రమ క్వారీలను మూయించే కాంగ్రెస్ పక్షాన పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. అంతకుముందు అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అలాగే బిజిగిరిషరీఫ్ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వావిలాలలోని ఖాదీని సందర్శించి ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హుజూరాబాద్‌లో జరిగిన బహిరంగ సభలోనూ ఆయన మాట్లాడారు. నాయకులు మక్కాన్‌సింగ్, నాయిని రాజేందర్‌రెడ్డి, పత్తి కృష్ణారెడ్డి, ఇంగిలి రామారావు, పూదరి రేణుక శివకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.







పవిత్రోత్సవాలు ప్రారంభం

కొండగట్టు(చొప్పదండి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం పవిత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. తొలిరోజు ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేకపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశ్, సూపరింటెండెంట్ సునీల్, చైర్మన్ మారుతీస్వామి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వద్దు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జగిత్యాల: బియ్యం సరఫరా, పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దని అదనపు కలెక్టర్ లత సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆహారభద్రత చట్టం– 2 జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ రేషన్ షాపుల్లో నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. పంపిణీలో సమస్యలు ఎదురైతే 94417 23979, 18004250033 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు రాంమోహన్‌రావు, తిరుమలయ్య, నందయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా బ్రహ్మోత్సవాలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 3నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. స్థానిక పాత టీటీడీ కల్యాణ మండలంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎస్పీ భాస్కర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ, 13 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తితే సహించేది లేదని హెచ్చరించారు. తాగునీరు, నీడ, భోజన వసతి కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా బాత్‌రూంలు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. వైద్యం, పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోదావరి నదిలో ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ప్రత్యేకపూజలు చేశారు. అడిషనల్ కలెక్టర్ మకరంద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆన్‌లైన్’ ఉపాధి

- డెలివరీ బాయ్స్‌గా కస్టమర్ల వద్దకు..
- ఎంతకష్టమైనా ఇష్టంతో పనిచేస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న యువత



- ఈ యువకుడి పేరు క్రాంతి. స్వస్థలం కోరుట్ల. డిగ్రీ పూర్తిచేశాడు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల కోసం విఫలయత్నం చేశాడు. చివరకు కోరుట్లలోని ఓ ఆన్‌లైన్ సంస్థలో డెలివరీ బాయ్‌గా ఉద్యోగంలో చేరాడు. రోజూ 8 గంటలపాటు బైక్‌పై ప్రయాణిస్తూ విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రతినెలా వేతనం రూ.11వేలు పొందుతున్నాడు. వేతనం తక్కువ, శ్రమ అధికమైనా డెలివరీ బాయ్‌గా ఇష్టంగానే పనిచేస్తున్నాడు.



కస్టమర్‌కు వస్తువు అందిస్తున్న డెలివరీ బాయ్



- ఇతడి పేరు అరుణ్, మెట్‌పల్లి స్వస్థలం. డిగ్రీ పూర్తయ్యాక ఆన్‌లైన్ సంస్థలో డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆన్‌లైన్ ఆర్డర్లను గ్రామీణ కస్టమర్లకు డెలివరీ చేస్తున్నాడు. ఒక్కోరోజు కనీసం 60 కి.మీ. – 80 కి.మీ. వరకు బైక్‌పై ప్రయాణిస్తాడు. అయితే, ఉదయం నుంచి రాత్రి వరకూ ఎక్కడ స్థిరంగా ఉండే పరిస్థితి లేదు. ఇంత కష్టపడితే నెలకు రూ.15 వేలకు మించి వేతనం లభించడంలేదు.

కథలాపూర్(వేములవాడ): వాళ్లు డిగ్రీలు, పీజీలు పూర్తిచేశారు.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు.. అవకాశాలనూ జారవిడుచుకోలేదు.. సొంత ఊరులోనే ఉపాధి వెతుక్కున్నారు.. అదికూడా ఎంతకష్టమైనా.. అంతకుమించి ఇష్టంతో ఆ పనులు ఎంచుకున్నారు.. కరోనా తగ్గుముఖం పట్టాక వృద్ధి చెందిన ఆన్‌లైన్ వ్యాపారంపై దృష్టి కేంద్రీకరించారు. వివిధ సంస్థల్లో డెలివరీ బాయ్స్‌గా పనికి కుదిరారు. ఉద్యోగం లభించడం లేదనే నిరుత్సాహంలో ఉన్న యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

గ్రామాలకూ ‘డెలివరీ’ ప్రయాణం..

- జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఆన్‌లైన్ షాపింగ్ సంస్థలు కేంద్రంగా చేసుకొని గ్రామాలకు వస్తుసామగ్రి సరఫరా చేస్తున్నాయి.
- ప్రధానంగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఎక్స్‌ప్రెస్‌బీస్, ఈకామ్ ఎక్స్‌ప్రెస్, ప్రొఫెషనల్ కొరియర్, స్నాప్‌డీల్, షాప్– 101, బ్లూడాట్, గోజావోస్ కొరియర్, ఈకాట్ లాజిస్టిక్స్, ఇండియా పోస్ట్, ఎగో లాంటి సంస్థలు వినియోగదారులకు ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నాయి.

ఒక్కో సంస్థలో పదిమందికి ఉపాధి..

కస్టమర్లు తమకు అవసరమైన వస్తువులు, నాణ్యత, ధరల ఆధారంగా తమకు నచ్చిన సంస్థలో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. కొన్నింటికి వెంటనే డెబిట్, క్రెడిట్ కార్డులు, పేటీఎం, ఫోన్‌పే ద్వారా ముందుగానే డబ్బులు చెలిస్తున్నారు. మరికొన్ని వస్తువులు ఇంటికి చేరాక డబ్బులు చెల్లించే సౌకర్యం ఉంది. జిల్లాలో సుమారు 15 ఆన్‌లైన్ సంస్థలు ఆర్డర్‌పై వస్తువుసేవలు అందిస్తున్నాయి. జగిత్యాల కేంద్రంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ కార్యాలయం పరిధిలోని ఒక్కో సంస్థలో కనీసం 10 మంది డెలివరీ బాయ్స్ ఉపాధి పొందుతున్నారు. కోరుట్ల కేంద్రం పరిధిలో 8 మంది – 9 మంది డెలివరీ బాయ్స్ పనిచేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా సుమారు 200 మంది యువకులు డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తూ తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

ఆర్డర్ చేస్తేస్తే చాలు ఇంటికే..



మాది మారుమూల గ్రామం. డ్రెస్సులు, వస్తువులు కొనుగోలు చేసేందుకు సుమారు 15కి.మీ. దూరంలోని కోరుట్ల, లేదా 45 కి.మీ. దూరంలోని జగిత్యాలకు వెళ్లాలి. కానీ, ప్రస్తుతం ఆన్‌లైన్ సంస్థల్లో బుక్ చేసుకుంటే చాలు.. మా ఇంటికే వస్తున్నాయి. డెలివరీ బాయ్‌లు తీసుకొచ్చి ఇస్తున్నారు. మొబైల్ ఫోన్‌తోనే ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. ఇక దూరభారం తప్పింది. సమయం ఆదా అవుతోంది.

– గుండేటి రామాంజనేయులు, చింతకుంట

ఆన్‌లైన్‌లో ఫెస్టిసైడ్స్ ఆర్డర్



ఈ ప్రాంతంలోని అందరు రైతులు ఒకట్రెండు రకాల కంపెనీలకు చెందిన విత్తనాలు, ఫెస్టిసైడ్స్ వినియోగించడం సహజం. దీనికి భిన్నంగా ఆలోచించి మిరపకు సంబంధించిన విత్తనాలు, ఫెస్టిసైడ్స్‌ను ఆన్‌లైన్‌లో సర్చ్ చేసిన. ఆర్డర్ పెట్టి విత్తనాలు తెప్పించి అవే నాటించిన. ఫెస్టిసైడ్స్ స్ప్రే చేయించిన. అధిక దిగుబడి వచ్చింది. ఆన్‌లైన్ సంస్థలతో మా ఊరికి కొత్తరకం విత్తనాలు నాటే అవకాశం వచ్చింది. అధిక దిగుబడి రావడం ఆనందంగా ఉంది.

– బద్దం మహేందర్‌రెడ్డి, రైతు, భూషణరావుపేట

క్లుప్తంగా

అర్హులకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

జగిత్యాలటౌన్: అర్హులందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని పలువురు మహిళలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. బుధవారం పలువురు మహిళలు ఆయన నివాసంలో కలిశారు. అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నామని తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం ఎమ్మార్వోతో ఫోన్లో మాట్లాడారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని ఎమ్మెల్సీ సూచించారు. లబ్ధిదారులుకు త్వరగా ఇళ్లు కేటాయించాలని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తిచేసి అర్హులకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వైఎస్సార్‌టీపీలోకి 50 మంది చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజమ్మ

వెల్గటూర్: వైఎస్సార్‌టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపెల్లి రాజమ్మ ఆధ్వర్యంలో బుధవారం అంబరిపేట గ్రామానికి చెందిన సుమారు 50 మంది మహిళలు పార్టీలో చేరారు. వారందరికీ నియోజకవర్గ ఆమె కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో కుటుంబ పాలనపై ప్రజలంతా తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. షర్మిల పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ధర్మపురి మండల అధ్యక్షురాలు తడగొండ స్వరూపరాణి, వినోద, వజ్రమ్మ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

జగిత్యాల టౌన్: రాబోయే రోజుల్లో దళితులు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి అన్నారు. బుధవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ఆదేశాల మేరకు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా వంగ పుష్పలత, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా కొడిపెల్లి రాకేశ్‌ను నియమించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు దళితులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. దళిత ఎమ్మెల్యే సాయన్న మృతిచెందితే కనీసం ప్రభుత్వం అంత్యక్రియలు నిర్వహించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల మహేశ్, యువజన ప్రధాన కార్యదర్శి ఎర్క గోకుల కీర్తికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్ర రాజు, జనరల్ సెక్రటరీ, చింతకుంట గంగాధర్ తదితతరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధర మళ్లీ పెంపు

- వంటగ్యాస్‌పై రూ.50, కమర్షియల్‌పై రూ.350 అదనం
- ఉమ్మడి జిల్లా వినియోగదారులపై రూ.2.50 కోట్ల భారం



కరీంనగర్ అర్బన్: మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా తయారైంది వినియోగదారుల పరిస్థితి. ఓవైపు కరోనాతో ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కాగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు గుండెల్లో గుబులు రేపుతున్నాయి. తాజాగా వంటగ్యాస్ ధరలను పెంచడం ఆందోళనకర పరిణా మం. రాయితీ గ్యాస్ సిలిండర్లకు రాయితీని కేంద్రం ఖాతాలో జమ చేస్తున్నప్పటికీ నగదు మొత్తం చెల్లించాల్సి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రస్తుత పెంపుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయా వ ర్గాలపై నెలకు రూ.2.50 కోట్ల భారం పడనుంది.

గత ఆగస్టులో రూ.666.. ఇప్పుడు రూ.1,175

గత మూడేళ్లలో గ్యాస్ సిలిండర్ ధరలను తొమ్మిదిసార్లు పెంచేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్యాస్ వినియోగదారులు 5,00,720 మంది ఉన్నారు. సగటున నెలకు 3.50 లక్షల సిలిండర్ల వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. గత ఆగస్టులో సిలిండర్ ధర రూ.666 ఉంది. ఇప్పటివరకు రూ.1,125 చెల్లిస్తుండగా ఇకనుంచి రూ.1,175 చెల్లించాల్సి ఉంటుంది.

'కమర్షియల్'.. ఒకేసారి రూ.350 పెంపు

కమర్షియల్ సిలిండర్ ధర ఈ నెల 28వ తేదీ వరకు రూ.2,015 ఉండగా ఒకేసారి రూ.350 పెంచడంతో రూ.2,365కు చేరింది. ఎన్నికల సమయం కావడంతో ధరలను తగ్గించి, వినియోగదారులను తమవైపు తిప్పుకుంటారని భావిస్తే అలా జరగలేదు. ఫలితంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, వివిధ రకాల ఆహార ఉత్పత్తులకు ధరలు పెరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కమర్షియల్ సిలిండర్లు 80 వేలుండగా పెరిగిన ధరతో నెలకు రూ.2.80 కోట్లు భారం పడనుంది.

ఉమ్మడి జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు	
కరీంనగర్:	1,32,210
జగిత్యాల:	1,28,312
పెద్దపల్లి:	1,31,098
సిరిసిల్ల:	1,09,100

ఆగని వసూళ్లు.. రాయితీపై స్పష్టతేదీ?

ఓవైపు గ్యాస్ ధరలు పెరుగుతుంటే డోర్ డెలివరీ బాయ్స్ వసూళ్లు మాత్రం ఆగడం లేదు. అక్రమ వసూళ్లపై అధికారులకు సమాచారమిచ్చినా చర్యలు శూన్యమని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పట్టణాల్లో సిలిండర్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఉమ్మడి జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు 96 ఉన్నారు. 5 కిలోమీటర్లలోపు దూరం ఉంటే వినియోగదారులకు ఉచితంగా సిలిండర్ ఇంటికి చేరవేయాలి. ఆపై దూరం ఉంటే రూ.10 మాత్రమే తీసుకోవాలి. వినియోగదారుడి ఇంటికి గ్యాస్ సిలిండర్‌ను చేర్చడం ఏజెన్సీ నిర్వాహకుడి బాధ్యత. ఒకవేళ వినియోగదారులు ఏజెన్సీకి వెళ్లి, గ్యాస్ తెచ్చుకుంటే రూ.16.47 తక్కువగా తీసుకోవాలి. కానీ ఇవి ఎక్కడా అమలు కావడం లేదు. అయితే వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం తొలుత సిలిండర్‌కు రూ.220 చొప్పున రాయితీ ఇచ్చింది. ప్రస్తుతం రూ.47 మాత్రమే జమ చేస్తోంది. ఇప్పుడు ధర పెరిగినా రాయితీపై స్పష్టత ఇవ్వలేదు.

కట్టెల పొయ్యే ఉత్తమం..



గ్యాస్ ధరలను తగ్గించాల్సింది పోయి ఏటికేడు పెంచుతున్నారు. ఒకప్పుడు రూ.514 ఉంటే ఇప్పుడు రూ.1,175కు పెంచారు. ఆ స్థాయిలో ప్రజల ఆదాయం పెరగడం లేదు. ఇలాగైతే మళ్లీ కట్టెల పొయ్యిని ఆశ్రయించడమే ఉత్తమం.

– శిరీష, గృహిణి, కట్టరాంపూర్

వ్యాపారం దెబ్బతింటుంది..



నేను టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న. మా రంగంలో పోటీ ఎక్కువ. గ్యాస్ ధరను ఏకంగా రూ.350 పెంచారు. దీనివల్ల ఇప్పుడున్న రేటుకు టిఫిన్లు చేస్తే గిట్టుబాటు కాదు. టిఫిన్ ధర పెంచితే కస్టమర్లు రాక వ్యాపారం దెబ్బతింటుంది.

– అనిల్, వ్యాపారి

వైద్య కళాశాల భవనం పనులు పూర్తిచేయాలి



వైద్య కళాశాల పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం వైద్య కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని సూచించారు. అనంతరం మాతాశిశు సంక్షేమ కేంద్రం ముందు ఉన్న కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులతో మాట్లాడారు. ఆమెవెంట వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించాలి..

జగిత్యాల మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన వారికి కేటాయించేందుకు గురువారం ధ్రువీకరణ పత్రాలను అందించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. అర్హులైన వారు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 15 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా పరీక్షల కన్వీనర్ నారాయణ, అధికారులు ఉన్నారు.

దళితజాతిని కించపరిచిన వ్యక్తిని శిక్షించాలి

- తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మల్లాపూర్ : సోషల్ మీడియాలో దళితజాతిని కించపరిచిన మామిడి రాజశేఖర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి వెళ్లేందుకు అందరికీ భారత రాజ్యాంగం హక్కు కల్పించిందన్నారు. దళితులకు రాజకీయాల్లోకి వచ్చేందుకు అర్హత లేదన్నట్లుగా దుర్భాషలాడిన మామిడి రాజశేఖర్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలన్నారు. ఇక్కడ తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అరిగడ్డి పెద్దులు, కోశాధికారి నిగ రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు వినయ్ సాహూ, కోరుట్ల నరేష్, నాయకులు బాపురపు రాకేష్, మేకల సతీశ్, దళిత రాజు, మోతె రమేశ్, నూతిపెల్లి రాజం, గడచంద జగదీశ్, అనుపట్ల దినేశ్, ప్రదీప్, నాగేషు, పాతకాల అరుణ్, చిన్న పెద్దిరాజం, ఉయ్యాల లక్ష్మణ్, మనోహర్, దామెర శేఖర్, జెల్ల రాజన్న, తదితరులున్నారు.

పంట పొలాలకు సాగునీరందించాలి



ర్యాలీగా వెళ్తున్న రైతులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్

వెల్గటూర్ : నియోజకవర్గంలోని పొలాలకు సాగునీరందించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. బుధవారం ఎండపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. వేంనూరు పంప్‌హౌస్ నుంచి ముంజంపల్లి, మారేడ్‌పల్లి, ఉండెడ గ్రామాలకు, జంగల్‌నాలా ప్రాజెక్టుకు కాళేశ్వరం లింక్–2 ద్వారా నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గోదావరి నదిపై శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణానికి, మండల కేంద్రంలో నిర్మిస్తున్న కాళేశ్వరం లింక్–2 ప్రాజెక్టుకు భూములిచ్చిన ముంజంపల్లి, మారేడ్‌పల్లి, ఉండెడ, శాఖాపూర్, కొండాపూర్, జగదేవుపేట రైతులకు సాగునీరందించడం లేదన్నారు. రైతులపై మంత్రి కొప్పులకు చిత్తశుద్ధి ఉంటే వారం రోజుల్లోపు వేంనూరు పంప్‌హౌస్ కింది పొలాలకు నీరందించాలన్నారు. లేని పక్షంలో ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ వద్ద ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేల మంది రైతులతో ధర్నా చేపడతామన్నారు. రాస్తారోకోలో మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, వెల్గటూర్ సర్పంచ్ మెరుగు మురళి, ఎంపీటీసీలు మంజుల, తిరుపతి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి గంద్ర శ్రీకాంత్‌రావు, మండల యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన కారు

- డోర్లు తీసుకొని, బయటపడిన యువకులు
- పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో ఘటన
- మద్యం మత్తులో కారు నడపడమే కారణం?



కాలువలో పడిన కారు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఎస్సారెస్పీ ఆర్‌ఎస్‌డీ–4 కాలువలోకి బుధవారం రాత్రి ఓ కారు అదుపుతప్పి, దూసుకెళ్లింది. మద్యం మత్తులో కారు నడపడం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు, స్థానికుల ద్వారా తెలిసింది. అయితే ఎస్సారెస్పీ కాలువలో బుధవారం నుంచే నీరు వస్తుండటం, కారు అందులో పడిపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జనం అధిక సంఖ్యలో గుమిగూడారు. చిన్న కాలువ కావడంతో కారులో ఉన్న ముగ్గురు యువకులు డోర్లు తీసుకొని, పైకి రావడంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు యువకుల వివరాలపై ఆరా తీశారు. తాండూరు మండలంలోని కిష్టంపేటకు చెందిన సార్ల అనిల్‌కుమార్, పెద్దపల్లికి చెందిన రేవెల్లి సుమన్, మరో యువకుడు ఓ ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలిపారు.

డీఎల్పీవో విచారణ



విచారణ చేస్తున్న డీఎల్పీవో శంకర్

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామంలో డివిజనల్ పంచాయతీ అధికారి శంకర్ బుధవారం విచారణ చేపట్టారు. గ్రామ సర్పంచ్‌పై పలు ఆరోపణలు చేస్తూ అదే గ్రామానికి చెందిన బత్తుల రాజలింగం కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టినట్లు డీఎల్పీవో శంకర్ పేర్కొన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీవో గంగాధర్, సర్పంచ్ మిట్టపెల్లి గంగారెడ్డి, ఉపసర్పంచ్ బత్తుల అశోక్ ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంపై మొగ్గు

- అధిక దిగుబడులపై దృష్టిసారిస్తున్న రైతులు
- క్షేత్ర సందర్శనకు వెళ్తున్న అన్నదాతలు



క్షేత్ర సందర్శనకు వెళ్లిన అలూరు యువ రైతు దంపతుల బృందం

జగిత్యాల అగ్రికల్చర్ : ఆ గ్రామ యువ రైతు దంపతులు అంతా చదువుకున్నవారే. సంప్రదాయ, ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ రంగంలో రాణించేందుకు ఆధునిక సాగు పద్ధతులను తెలుసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. రసాయనాలు, ఖర్చులు తగ్గించుకోవడం వంటి పద్ధతులను పాటించేందుకు క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్తున్నారు. ఆ యువ రైతు దంపతుల బృందానికి కేరాఫ్‌గా నిలిచింది రాయికల్ మండలంలోని అలూర్ గ్రామం.

అంతా ఉన్నత చదువులు చదివిన వారే..

గ్రామంలో దాదాపు వంద యువ రైతు కుటుంబాలు ఉంటాయి. అంతా ఉన్నత చదువులు చదివిన వారే ఉన్నారు. వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగుచేసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. సాగులో పాటించాల్సిన పద్ధతుల గురించి తెలియకపోవడంతో నష్టాల పాలవుతున్నారు.

క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు..

వ్యవసాయాధికారులు ఎక్కడ సమావేశాలు నిర్వహించినా రైతులు వేళ్లేవారు. ఇప్పటికే నూతన పంటలు సాగుచేస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్న రైతుల పొలాలకు వద్దకు వెళ్లాలని గ్రామంలోని దంపతులంతా నిర్ణయించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి

పంటలకు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు చల్లడంతో అనారోగ్యంతో పాటు భూసారం దెబ్బతింటుంది. కాగా ఖర్చులేని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలుసుకునేందుకు భావించారు. ఈ నేపథ్యంలో, బీర్‌పూర్ మండలం తుంగూర్‌లో మిట్టపెల్లి రాములు అనే రైతు దాదాపు 20 ఏళ్లుగా భూమిని దున్నకుండా, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వేయకుండా మామిడి తోటను సాగుచేసే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆవు మూత్రం, పేడతో ఘనామృతం, జీవామృతం తయారీ పద్ధతులతో పాటు పంటపై తెగుళ్లు, పురుగులు ఆశిస్తే అగ్నిఅస్త్రం తయారీ వంటి పద్ధతులు, ఉపయోగించే విధానాన్ని తెలుసుకున్నారు. అలాగే, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పనిముట్లపై తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను వీరంతా సందర్శించేలా ఏర్పాట్లు చేశారు. వరి, మొక్కజొన్న పంటలకు స్వస్తి చెప్పి ఖర్భూజతో కూరగాయలు సాగుచేయడంపై దృష్టి సారించారు.

ఎన్నో విషయాలు తెలుసుకున్నాం



ఇన్ని రోజులు తాము సాగుచేస్తున్న పంటలతోనే అధిక ఆదాయం వస్తుందనుకునే వాళ్లం. కానీ ఇతర పంటలు సాగుచేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్న రైతుల వివరాలు తెలుసుకొని క్షేత్రస్థాయి సందర్శన కు వెళ్లాం. ఇకముందు నూతన పంటలను సాగుచేసి లాభాలు ఆర్జిస్తాం.

–ఆకుల లింబక్క, మహిళా రైతు

క్షేత్రస్థాయిలో పరిశీలించాం



ఇటీవల 50 మంది యువ రైతుల దంపతులంతా కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాం. నూతన పంటల సాగు విధానంపై తెలుసుకున్నాం. మానసిక ప్రశాంతతతో పాటు వ్యవసాయంలో అనుసరించాల్సిన పద్ధతులను తెలుసుకున్నాం.

– నల్లాల ఆదిరెడ్డి, రైతు

ఏళ్లుగా పంట నష్టపోయాం



ఏళ్లుగా మామిడితోటను సాగుచేస్తున్నాం. అయినా తగిన ఆదాయం రాకపోవడంతో తుంగూర్‌లోని మామిడితోటను సాగుచేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్న మిట్టపెల్లి రాములు పంటను పరిశీలించాం. సాగులో అధిక దిగుబడి సాధించేందుకు వివరాలు అడిగి తెలుసుకున్నాం.

–అలిపెద్ది సునీత, మహిళా రైతు

కొండపాక శివారులో వ్యక్తి దుర్మరణం

- మృతుడు రామగుండంవాసి
- బైక్ చెట్టును ఢీకొట్టడంతో ఘటన

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ వివరాల ప్రకారం.. రామగుండం మండల కేంద్రానికి చెందిన కార్లోసస్ సికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో ఉంటున్న బావ పులి కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. బుధవారం స్వగ్రామానికి తండ్రి డేని విన్సెంట్, బావ కిరణకుమార్‌తో రెండు బైక్‌లపై బయలుదేరారు. ఒక బైక్‌పై తండ్రి, బావ, మరో బైక్‌పై కార్లోసస్ వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక గ్రామ శివారులో కార్లోసస్ బైక్ అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి, బావ రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మే రకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: యువకుడిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించిన నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమా మంగళవారం తీర్పు నిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన అవుట్ల నర్సయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు. కూతురికి వివాహం కాగా, కుమారుడు శివరాజ్ ఉపాధి కోసం సౌదీకి వెళ్లి ఇంటికి వచ్చాడు. శివరాజ్‌తో పాటు అదే గ్రామానికి చెందిన అవుట్ల అజయ్, అవుట్ల రాజేష్ అలియాస్ సునీల్‌తో పాటు కొందరు గ్రామ శివారులోని గోదావరి వద్ద విందు చేసుకున్నారు. ఈ సమయంలో శివరాజ్‌కు, అవుట్ల అజయ్‌కు ఓ యువతి విషయంలో గొడవ జరిగింది. ఇది మనస్సులో పెట్టుకున్న అజయ్, రాజేష్ 2017 ఫిబ్రవరి 27 రోజున రాత్రి పని ఉందని చెప్పి శివరాజ్‌ను ద్విచక్ర వాహనంపై కోమటి కొండాపూర్ గ్రామ శివారుకు తీసుకెళ్లి హత్యచేశారు. అనంతరం ద్విచక్రవాహనంపై నుంచి పడి తీవ్రగాయాలైనట్లు గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సమాచారం అందించారు. చికిత్స కోసం శివరాజ్‌ను మెట్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్, అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా మృతిచెందాడు. మృతుడి తండ్రి నర్సయ్య ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అజయ్, రాజేష్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ సురేందర్ కేసు దర్యాప్తు చేసి, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం రెండో నిందితుడైన అవుట్ల రాజేష్ అలియాస్ సునీల్‌కు యావజ్జీవ శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అయితే, ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న అవుట్ల అజయ్ తప్పించుకుని తిరుగుతుండటంతో పోలీసులు కోసం గాలింపు చర్యలు చేపట్టగా అతనిపై కేసు పెండింగ్‌లో ఉంది.

పిచ్చికుక్కల స్వైరవిహారం

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలో బుధవారం పిచ్చికుక్కలు స్వైరవిహారం చేశాయి. ఓ గీత కార్మికుడితో పాటు ఐదు గేదెలపై దాడిచేశాయి. మండలకేంద్రానికి చెందిన సందుపట్ల మహేందర్ రెడ్డి, పోరంపేట్ దేవయ్య, మక్కిన చంద్రారెడ్డి, సందుపట్ల రాంరెడ్డికు చెందిన ఐదు గేదెలతో పాటు ఓ గీత కార్మికుడిపై దాడిచేశాయి. కాగా పశు వైద్యాధికారులు చేరుకొని వాటికి చికిత్స అందించారు. కుక్కలబెడద నుంచి రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా గ్రామస్తులు కోరుతున్నారు.